సాక్షి పెద్దపల్లి

శనివారం : 31 : ఆగస్టు : 2024



దశల వారీ ఉద్యమం

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి దశలవారీ ఉద్యమా చేస్తామని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. జీడీకే–1వ గనిపై ఆయన మాట్లాడారు.



పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని పలు వీధుల్లో చేపట్టిన స్వచ్ఛ శుక్రవారం పనులను పర్యవేక్షించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న డీఈవో మాధవి

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా విద్యాధికారి మాధవి తెలిపారు. సర్కారు బడుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యాబోధనలో అహర్నిషలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందుకోసం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పక్కా ప్రణాళికలు తయారు చేసుకుంటున్నారని అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ రెండో సమావేశంలో డీఈవో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన తీరుపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం దేవేందర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానాచార్యులకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సత్యాచార్యులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): స్థానిక వేదపాఠశాల ప్రధానాచార్యులు తిప్పర్తి సత్యాచార్యులు ఆంధ్రప్రదేశ్ బుక్ ఆఫ్ రికార్డు తెలుగు సంస్కృతి, సాహితీ సేవాట్రస్ట్ ద్వారా వేదాద్యా సామ్రాట్ పురస్కారం అందుకున్నారు. వేద విద్యారంగంలో ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన సంస్థ ఈ బిరుదుతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేసింది. జగత్ మహామౌనీశ్వరాశ్రమ పీఠాధిపతి బసవత్తుల రాజమౌళి ఆచార్యులు శుక్రవారం శాలువా కప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్వాలిఫైడ్ డాక్టర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్

సుల్తానాబాద్(పెద్దపల్లి): క్వాలిఫైడ్ డాక్టర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ సూచించారు. స్థానిక దంత వైద్యశాలలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు వైద్యులు అల్లోపతి సర్టిఫికెట్లు లేకున్నా వైద్యం చేస్తున్నారని తెలిపారు. మరికొందరు పీఎంపీ, ఆర్ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేయడంతో పేషెంట్లు మృతి చెందినట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హత ఉన్న డాక్టర్లు ప్రిస్క్రిప్షన్ రాస్తేనే ఇంజక్షన్ చేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు. ఆయన వెంట సుధాకర్‌రెడ్డి, రాజమౌళి తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీ స్క్రీనింగ్ టెస్ట్‌పై ఒకరోజు శిక్షణ


పెద్దపల్లిరూరల్: పల్లె దవఖానాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలకు హెచ్ఐవీ స్క్రీనింగ్ పరీక్షలపై శుక్రవారం ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ పర్యవేక్షించారు. జిల్లాలోని ఐసీటీసీలతోపాటు పల్లె దవాఖానల్లోనూ హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు. హెచ్ఐవీ పరీక్షలు చేసుకున్నవారి వివరాలు గోప్యంగా ఉంచుతామనాయన అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అన్నప్రసన్నకుమారి, సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్ సత్యానందం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎం కిట్లు పంపిణీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పలు పాఠశాలల్లో చదువుతున్న మేధో దివ్యాంగ విద్యార్థుల(బాలబాలికలు)కు టీచింగ్, లర్నింగ్, మెటీరియల్ కిట్లు(టీఎల్ఎం) శుక్రవారం డీఈవో మాధవి పంపిణీ చేశారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలోని భవిత సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో 15మందికి కిట్లు అందజేశారు. దివ్యాంగ విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఇంటి వద్ద, పాఠశాలలో టీఎల్ఎం కిట్లను వినియోగించి సామర్థ్యాన్ని పెంచాలని డీఈవో సూచించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ లఖన్‌బాబు, ఎంఈవో సురేందర్‌కుమార్, అజిమొద్దీన్ డబీర్ తదితరులు ఉన్నారు.

రామగిరి ఖిల్లా.. ఆహ్లాదం చూడతరమా..





చుట్టూ పచ్చని చెట్లు.. ఆహ్లాదం పంచే ప్రకృతి.. అద్భుతమైన ప్రాచీన కళాఖండాలు.. పర్యాటకులను విశేషంగా ఆకర్షించే రామగిరిఖిల్లా సొంతం.. బురుజులు, రాతిగోడలు, ఫిరంగులు.. ముఖద్వారాలు, స్నానఘట్టాలు.. చరిత్రకు ఆనవాళ్లు.. రాముడు వనవాస సమయంలో ఇక్కడ నడయాడారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతేకాదు.. శ్రీసీతారాముల పాదుకలు, శివలింగం, కొలను, హనుమాన్, నంది విగ్రహాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న కొండ.. ఔషధ మూలికల అడవి.. రామగిరి సమీపంలోనివీ అద్భుతాలు.. పెద్దపల్లి జిల్లా తొలి కలెక్టర్ అలుగు వర్షిణి స్వయంగా అధికార యంత్రాంగంతో కలిసి ఖిల్లాపై పర్యటించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. మంత్రులూ ఖిల్లాను సందర్శించారు. అయినా ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోవడంలేదు. ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్ష రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తుండడంతో పర్యాటకుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సారూ.. సమస్యలు గుర్తున్నాయా?

- కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలెప్పుడు?
- బ్యాక్‌వాటర్ ముప్పు తప్పించేందుకు కరకట్ట నిర్మిస్తారా?
- గోదావరిఖనిలో రెండో ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు ఏమైంది?
- ఆందోళన కలిగిస్తున్న రాజీవ్ రహదారిపై ప్రమాదాలు నియంత్రిస్తారా?
- నేడు పారిశ్రామిక ప్రాంతంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పర్యటన
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఏర్పాట్లలో అధికారులు, నేతలు



గోదావరిఖనిలో సభాస్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, ఐఎన్‌యూసీ నేత జనక్‌ప్రసాద్, బొమ్మక రాజేశ్ తదితరులు

రూ.28వేల కోట్ల బకాయిలు వస్తాయా?



- రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రూ.28వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. మరోవైపు.. సింగరేణికి నేరుగా బొగ్గు గనుల కేటాయింపు, కార్మికుల సొంతింటి పథకం, ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షల వడ్డీలేని రుణం, లాభాల్లో కార్మికుల వాటా, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను రద్దు తదితర సమస్యలు కార్మికులను ఇంకా వేధిస్తూనే ఉన్నాయి. కలుషితమైన తాగునీటితో కార్మికులు, వారి కుటుంబాలు ఏటా సీజనల్ వ్యాధుల బారిన పడుతూనే ఉన్నారు.

గోదావరి.. పర్యాటకం ఏదీ?



- గోదావరి నదీతీరాన్ని పర్యాటక స్థలంగా ప్రకటించాలని గతంలో ప్రభుత్వం నిర్ణయించింది. పర్యాటకులు బసచేసేందుకు హరిత హోటల్ నిర్మిస్తామని పర్యాటక శాఖ అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. నేటికీ పురోగతి కనిపించడం లేదు.

బసంత్‌నగర్ విమానాశ్రయ కలేనా?



- పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలకు అనుకూలంగా ఉన్న బసంత్‌నగర్ విమానాశ్రయం ఏర్పాటుపై దశాబ్దాలుగా సర్వేలు జరుగుతున్నాయి. స్థల పరిశీలనలు కొనసాగుతున్నాయి. అయినా, నేటికీ విమానాశ్రయం ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన రాలేదు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన ఇలా..

ఉదయం(గంటల్లో) : 9.30 బేగంపేట్ ఎయిర్‌పోర్టు

10.20 రామగుండం పోలీసు కమిషనరేట్

10.30 -11.00 రామగుండం 800 మెగావాట్ల పవర్‌ప్లాంట్ స్థల పరిశీలన

11.05 - 12.00500 మెగావాట్ల జల విద్యుత్ స్థల పరిశీలన

మధ్యాహ్నం(గంటల్లో)

12.05 - 12.30 తిలక్‌నగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

12.35 - 1.30 టీయూఎఫ్ఐడీసీ అమృత్ 2.0 పనులకు భూమిపూజ, బహిరంగసభ

1.30-2.30 ఇల్లెందు గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి

2.30 రోడ్డు మార్గం ద్వారా చెన్నూర్ పర్యటనకు..

రోడ్డుప్రమాదాలతో ఆందోళన



- రాజీవ్‌రహదారిపై గంగానగర్ నుంచి సింగరేణి బీ – గెస్ట్‌హౌస్ వరకు నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏటా పదుల సంఖ్యలో ప్రాణాలు పోతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. జనం రద్దీగా ఉండే ఎన్టీపీసీ లేబర్ గేట్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆర్టీసీ బస్టాండ్, గంగానగర్ ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు లేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

గోదావరిఖని: గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు అంటే 2023 ఏప్రిల్ 16, 17వ తేదీల్లో జిల్లాలో పాదయాత్ర నిర్వహించిన ప్రస్తుత డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క.. ఈ ప్రాంతంలోని సమస్యలను అవలోకనం చేసుకున్నారు. ఇంధన, ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో శనివారం పర్యటించనున్నారు. అప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించిన సమస్యలకు ఇప్పుడు పరిష్కార మార్గం చూపుతారా? అని జిల్లావాసులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఉదయం 10.20 గంటలకు రామగుండం పోలీసు కమిషనరేట్‌లోని హెలిప్యాడ్‌కు హెలికాప్టర్ ద్వారా చేరుకునే డిప్యూటీ సీఎం.. ఆ తర్వాత వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొంటారు. ఈమేరకు శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, సీపీ శ్రీనివాస్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పర్యటనకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆచరణకు రాని హైపవర్ కమిటీ వేతనాలు

- సింగరేణి సంస్థలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కోలిండియా మాదిరిగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలనే డిమాండ్ ఇంకా అలానే ఉండిపోయింది. వేతనాలు పెంచేందుకు జీవో 22 నంబరు అమలు చేయాలని కార్మికులు కోరుతున్నా ఆచరణలోకి రావడంలేదు. ఉచిత విద్య, వైద్యం, క్వార్టర్ సౌకర్యం కల్పన కలగానే మిగిలిపోతోంది.

కరకట్ట నిర్మాణం చేపట్టాలి..

- సుందిళ్ల బ్యారేజీ నిర్మాణంతో గోదావరిఖనిలోని పలు లోతట్టు ప్రాంతాలు బ్యాక్ వాటర్‌తో జలమయమవుతున్నాయి. భారీ వర్షాలు, వరదలు వస్తే జనాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నారు. బ్యాక్‌వాటర్ ముప్పులేకుండా కరకట్ట నిర్మించాల్సి ఉంది.

అత్యధిక ఆదాయం ఉన్నా..

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఆర్టీసీకి అత్యధిక ఆదాయం లభించే గోదావరిఖని బస్ డిపో విస్తరణ ప్రతిపాదనలకే పరిమితమైంది. యైటింక్లయిన్ కాలనీ బస్టాండ్, బస్‌డిపో విస్తరణ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. రెండో డిపో మంజూరైనా ఏర్పాటుపై ఊసేలేదు.

అనుబంధ కళాశాలలు వచ్చేదెప్పుడో..?

- సింగరేణి మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్, డెంటల్ కాలేజీలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఇంకా అది కార్యరూపం దాల్చడం లేదు. వైద్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త డంపింగ్ స్థలం లేదు

- రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటింటా సేకరించే చెత్త డంపింగ్ కోసం ప్రత్యేకంగా యార్డులేదు. ఇందుకోసం 50ఎకరాల స్థలం కేటాయించాల్సి ఉంది. ఇలాంటి అనేక సమస్యలపై డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉందని జిల్లావాసులు కోరుతున్నారు.

పటిష్ట బందోబస్తు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గోదావరిఖని పర్యటనకు పటిష్టమైన పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల డీసీపీలు చేతన, భాస్కర్‌తో కలిసి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించారు. సభ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, సభకు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చించారు. భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, జైపూర్, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, రమేశ్, వెంకటేశ్వర్లు, నర్సింహులు, ప్రతాప్, సురేంద్ర తదితరులు ఉన్నారు.



బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న సీపీ శ్రీనివాస్

టెస్టుల కోసం బారులు



విషజ్వరాలు ప్రజలను ముప్పతిప్పలు పెడుతున్నాయి. సీజనల్ వ్యాధుల బారిన పడుతున్న జిల్లావాసులు వైద్యం కోసం ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. వీరిరాకతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రద్దీగా మారుతున్నాయి. పేషెంట్లను పరీక్షిస్తున్న వైద్యులు.. వ్యాధుల నిర్ధారణ కోసం టెస్టులు రాస్తున్నారు. ఈ చీటీలు పట్టుకుని ల్యాబ్‌ల వద్దకు వెళ్తే అక్కడ కూడా పదుల సంఖ్యలో బారులు తీరి ఉంటున్నారు. దీంతో తమ వంతు వచ్చే వరకూ గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలోని ల్యాబ్ వద్ద శుక్రవారం శాంపిళ్లు ఇచ్చేందుకు బారులు తీరిన పేషెంట్లను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): నర్సాపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేరారు. మల్లయ్య వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా రూ.2,25,000 ఎల్‌వోసీ మంజూరైంది. దీనని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో బాధితుడి కుటుంబసభ్యులకు శుక్రవారం అంజేశారు.

పులి నాగమణి సంస్మరణ సభ

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాశీ తీర్థయాత్రలో గుండెపోటుకు గురై మృతి చెందిన పులి నాగమణి సంస్మరణ సభ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, ఉమ్మడి రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, రిటైర్డ్ ఎంఈవో పులి మల్లారెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కార్మికుల సొంతింటి పథకం అమలు చేయండి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి, మాదాసి రామమూర్తి, కొమురయ్య, శ్రీనివాస్, సురేందర్

- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు సింగరేణి కార్మికుల సొంతింటి పథకం అమలు చేసి, ఒక్కో కార్మికుడికి 250 స్థలాల ఇంటి స్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం మంజూరు చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క పర్యటన నేపథ్యంలో సింగరేణి కార్మికుల సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఉపాధి ఇచ్చే కొత్త బొగ్గు గనుల తవ్వకానికి అనుమతుల విషయంపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. గనుల వేలంపై ప్రభుత్వ వైఖరి ఏమిటో వెల్లడించాలని అన్నారు. సింగరేణి సాధించిన లాభాలు ప్రకటించి, అందులో 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలన్నారు. 'పెర్క్స్'పై విధించిన ఆదాయ పన్ను రీయింబర్స్‌మెంట్ చేయాలని అన్నారు. కారుణ్య నియామకాల్లో పైరవీలకు చోటులేకుండా చూడాలని పేర్కొన్నారు. సింగరేణి అనుకూల సంఘాలతోనే సమావేశాలు నిర్వహించి, అందులో చర్చించిన విషయాలను వెల్లడించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాదాసి రామమూర్తి, నూనె కొమురయ్య, చెలుకలపల్లి శ్రీనివాస్, పల్లె సురేందర్, బొగ్గుల సాయి, పులిపాక శంకర్, రోడ్డ సంపత్, గండు శ్రావణ్, కొమురయ్య పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి కొమురయ్య

ముత్తారం(మంథని): పేదలకు పనికల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధిహామీ పనుల నమోదు పారదర్శకంగా ఉండాలని విజిలెన్స్ అసిస్టెంట్ అధికారి కొమురయ్య సూచించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన ఉపాధిహామీ పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. 14 గ్రామ పంచాయతీల్లో 222 పనులు చేపట్టగా, వేతనాల కింద రూ.2,42,84,039, మెటీరియల్ కోసం రూ.6,31,651 వెచ్చించారని తనిఖీ బృందం వెల్లడించింది. పంచాయతీరాజ్ పనులకు రూ.3,33,10,125 కాగా, అటవీశాఖ పరిధిలో రూ.8,53,651 ఖర్చు అయ్యాయని వివరించారు. సామాజిక తనిఖీలో అక్రమాలు బయట పడగా ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి రూ.77,500 రికవరీ చేయాలని ఆదేశించారు. సోషల్ ఆడిట్‌కు రూ.78,000 ఖర్చు అయ్యాయని చూపించారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులో ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఒకసారి మందలించి, రెండోసారి విధుల నుంచి తొలిగిస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తే చర్యలు

- ప్రభుత్వ వైద్యులకు జిల్లా వైద్యాదాధికారి హెచ్చరిక
- అనుమతిలేని ఆస్పత్రుల మూసివేతకు ఆదేశాలు



మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోద్‌కుమార్

సుల్తానాబాద్(పెద్దపల్లి): విధుల సమయంలో ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ ప్రభుత్వ వైద్యులను హెచ్చరించారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఓపీ రికార్డు, ఉద్యోగుల హాజరుపై ఆరా తీశారు. నిర్దేశిత సమయానికి విధులకు హాజరుకాని ఉద్యోగుల గురించి అధికారులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ప్రభుత్వ డాక్టర్లు, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే వైద్యులు విధుల సమయాల్లో ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేయొద్దన్నారు. కొందరు వైద్యులు ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, మరోసారి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పేషెంట్లతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం పేషెంట్ల రద్దీ అధికంగా ఉందని, వైద్య పరీక్షలు వేగవంతం చేయాలని, మందులు అందుబాటులో ఉంచాలని అన్నారు. కొరత ఉన్న ఔషధాలు ఇండెంట్ పెట్టి తెప్పించాలని తెలిపారు. వైద్యులు 24 గంటల పాటు పేషెంట్లకు అందుబాటులో ఉంటారని, ఎవరినీ సిఫారసు చేయొద్దని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా సిబ్బంది, డాక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమాదేవి, సుధాకర్‌రెడ్డి, రాజమౌళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు ఆస్పత్రుల మూసివేత

పట్టణంలో ఒక పిల్లల ఆస్పత్రి, రెండు దంత వైద్యశాలలు అనుమతి లేకుండా నడుస్తున్నాయని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ తెలిపారు. తను తనిఖీ చేసే సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని పేర్కొన్నారు. అనుమతి వచ్చే వరకూ వాటిని మూసిఉంచాలని ఆదేశించారు. అనుమతి లేకుండా నడిపే ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రతీ ఆస్పత్రి నోటీసు బోర్డుపై బిల్లుల పట్టిక, సేవలు, వైద్యుల వివరాలను నోటీసు బోర్డుపై ప్రదర్శించాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

ఆకాశవాణిలో మనోళ్ల బాణి



పాటలు పాడుతున్న నందగిరి మహిళలు

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని నందగిరి గ్రామానికి చెందిన శ్రీపెద్దమ్మతల్లి జానపద కళాబృందం సభ్యులకు ఆకాశవాణిలో పాటలు పాడేందుకు అవకాశం దక్కింది. ఈ మేరకు బృందంలోని మహిళలు మల్లన్న, ఎల్లమ్మ తల్లి జానపదాల పాటలు ఆలపించారు. ఐతరవేని సుగుణ, ఐతరవేని బక్కవ్వ, ఐలవేని నర్సయ్య, మాల రాజవ్వ పాటలు పాడిన వారిలో ఉన్నారు. ఆకాశవాణిలో తమ బాణి వినిపించిన మహిళలను గ్రామస్తులు అభినందించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ప్రతిభ



సుజిత్‌కుమార్



అక్షిత

ధర్మపురి: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ధర్మపురి విద్యార్థులు ప్రతిభ చాటారు. ధర్మపురికి చెందిన అక్కెనపెల్లి సుజిత్‌కుమార్ హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం పూర్తి చేశాడు. ఇటీవల నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో రూ.33లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికయ్యాడు. అలాగే ముత్తినేని అక్షర హైదరాబాద్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఇటీవల క్యాంపస్ సెలక్షన్స్‌లో రూ.12.7 లక్షల వార్షిక ప్యాకేజీకి ఎంపికైంది.

ప్రసాదాల గోదాంకు వర్షందెబ్బ



ప్రధాన ద్వారం వద్ద వర్షానికి ఉరవడంతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

వేములవాడ: రాజన్నను దర్శించుకునే భక్తుల్లో ఎక్కువ శాతం మంది భక్తులు స్వామి వారి ప్రసాదాలు లడ్డూ, పులిహోర కొనుగోలు చేసి తీసుకెళ్తారు. అయితే ఇందుకు ప్రసాదాల తయారీ గోదాం సక్రమంగా లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం వేకువజామున కురిసిన వర్షానికి ప్రసాదాల తయారీ గేటు వద్ద భవనం ఉరిసింది. నీళ్లన్నీ అక్కడే నిలిచిపోయాయి. అందులో పని చేసే సిబ్బందితో ఆలయ అధికారులు శుభ్రం చేయించి తిరిగి ప్రసాదాలు సిద్ధం చేసే పని ముందేసుకున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా స్వామివారికి ప్రసాదాలు తయారు చేసే సరైన భవనం లేకపోవడం శోచనీయమంటూ భక్తులు మండిపడుతున్నారు.





మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్న ముత్తైదువలు



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న ముత్తైదువలు

కుంకుమపూజలు.. వాయినాలు

వేములవాడ: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా వేములవాడలోని ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. రాజన్న ఆలయ అనుబంధ ఆలయమైన మహాలక్ష్మి ఆలయంలో మహిళలు అమ్మవారికి కుంకుమపూజలు, ఒడిబియ్యం సమర్పించుకుని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ఆలయ అర్చకులు చతుష్షష్టి పూజలు నిర్వహించారు.



తడుస్తూనే మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తడుస్తూనే మొక్కులు

వేములవాడ: వేములవాడలో శుక్రవారం వేకువజాము నుంచి ఉదయం 9 గంటల వరకు భారీ వర్షం కురిసింది. శ్రావణమాసం చివరి దశకు చేరుకుంటుండటంతో వర్షంలోనూ భక్తులు తడుస్తూ తమ ఇలవేల్పునకు మొక్కులు చెల్లించుకున్నారు.

గుప్తనిధుల కోసమేనా తవ్వకాలు?

- ధ్వంసమైన ప్రాచీనకట్టడ గోపురం
- నిచ్చెనను వదిలివెళ్లిన దుండగులు

పెద్దపల్లిరూరల్: జైనుల కాలంనాటి ఆలయ గోపురాన్ని దుండగులు ధ్వంసం చేశారు. గుప్త నిధుల కోసమే ఇలా చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్దపల్లి మండలం ముత్తారం గ్రామ శివారులోని ధర్మబాద గ్రామంలో జైనుల కాలంలో నిర్మించిన ఆలయంలో గుప్త నిధులు ఉన్నాయనే ప్రచారం ఉంది. అయితే, ఆలయంలో కొందరు తవ్వకాలు జరపడంతోపాటు గోపుర ప్రాంగణంలో ఓ భాగాన్ని కూల్చి నిచ్చెన అక్కడే వదిలేసి వెళ్లారు. శుక్రవారం ఈ విషయం బయటకు పొక్కింది. పోలీసులకు స్థానికులు సమాచారం అందించగా ఆలయ పరిసరాలు పరిశీలించి వెళ్లారని గ్రామస్తుల ద్వారా తెలిసింది.

గుప్తనిధుల కోసమే..!

అతిప్రాచీన ఆండాళమ్మ ఆలయకట్టడంపై చెక్కిన శిల్పాకళాఖండాలు ఆకట్టుకునేలా ఆనాటి చిత్రకారులు నిర్మించారు. ముక్తేశ్వరస్వామి స్వయంభూగా వెలిసి కొలువు దీరిన గుట్ట సమీపాన అప్పటి జమీందార్ ఎరబాటి రంగారావు ఆలయ నిర్మాణం చేయించారు. ఆయన మరణానంతరం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పదేళ్లక్రితం గుప్తనిధుల కోసం ఆలయ ఆవరణలో దుండగులు తవ్వకాలు జరిపారు. ఆ తర్వాత అధికారులు ఆలయ ప్రాంగణంలో పల్లె ప్రకృతివనం ఏర్పాటు చేశారు. దీంతో పరిసర మండలాలు, గ్రామల నుంచి ప్రజలు, సందర్శకులు వచ్చిపోతున్నారు. యూట్యూబ్ నిర్వాహకులు షార్ట్‌ఫిలింలు చిత్రీకరించేందుకు వస్తున్నారు. దీంతో ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటోంది. అయితే, ఆలయ గోపురం కింద గుప్తనిధులు ఉన్నాయనే అనుమానంతోనే కొందరు దుండగులు గోపురం ధ్వంసం చేశాసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడెనిమిది మంది గోపురంపై నుంచి లోనికి దిగి ధ్వంసం చేసి ఉంటారనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వారంతా పెద్దపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన వారే అయి ఉంటారని స్థానికులు సందేహపడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని స్థానికుల నుంచి ఆరా తీసినట్లు సమాచారం. అయితే ఆలయ గోపుర ధ్వంసం జరిగిన విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.





ధ్వంసమైన ఆండాళమ్మ ఆలయ గోపురం, దుండగులు వదిలివెళ్లిన నిచ్చెన

రెండో వివాహం చేసుకున్న భర్తకు జైలు

ధర్మారం(ధర్మపురి): చట్ట విరుద్ధంగా రెండో వివాహం చేసుకున్న మండల కేంద్రంలోని రాగుల మల్లేశం(34)కు ఏడాది జైలు శిక్షతోపాటు రూ.6వేల జరిమానా విధిస్తూ నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి వెంకట్ సచిన్‌రెడ్డి శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇవీ.. రాగుల మల్లేశంతో శ్రీలతకు 2010లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు ఆడపిల్లలు సంతానం కలిగారు. అయినా, 2015 డిసెంబర్‌లో పెద్దపల్లి మండలం పాలితం గ్రామానికి చెందిన మేకల వనితను చట్ట విరుద్ధంగా రెండో వివాహం చేసుకున్నాడు. తన అత్త, మామ రాగుల రాజయ్య - లక్ష్మితోపాటు వనిత ప్రాదల్బంతో రెండో వివాహం చేసుకున్నాడని శ్రీలత ధర్మారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఈ ముగ్గురితోపాటు భర్తపై కేసు నమోదు చేశారు. కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. దీంతో బాధితురాలి భర్త రాగుల మల్లేశానికి ఏడాది జైలు శిక్షతోపాటు రూ.ఆరువేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. మిగతా వారిని నిర్దోషులుగా విడుదల చేసినట్లు కోర్టు సూపరింటెండెంట్ కొమురయ్య తెలిపారు.

స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోండి

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో 9, 10వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం తెలిపారు. జాతీయ ఉపకార వేతనం వెబ్‌సైట్‌లో రెన్యువల్ ప్రిమెట్రిక్ విద్యార్థులు, ఇంటర్మీడియట్ ఒకేషనల్, ప్రొఫెషనల్, డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు పోస్ట్ మెట్రిక్, టాప్‌క్లాస్ ఎడ్యుకేషనల్ ఉపకరణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అక్టోబర్ 31లోపు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని, గడువు మీరిన దరఖాస్తులను తిరస్కరించబడతాయని పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పదిరోజుల జైలు

కరీంనగర్‌క్రైం: నగరంలో మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి కోర్టు పదిరోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ రమేశ్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం నగరంలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 25మందిని శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి పదిరోజుల జైలు, ఇద్దరికి మూడు రోజుల జైలు, రూ.6500 జరిమానా, మిగితావారికి రూ.35వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు సీఐ వివరించారు.

సింగిల్ విండోలో పోలీసుల విచారణ

చందుర్తి(వేములవాడ): చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై శుక్రవారం చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. సొసైటీలో రూ.32.34లక్షలు దుర్వినియోగం అయ్యాయని జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణ్‌జ్యోతి 20 రోజుల కిత్రం సీఈవో గంగారెడ్డిపై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అయితే సీఈవో తప్పించుకొని తిరుగుతూ ముందస్తు బెయిల్‌కు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు మూడు రోజులుగా తీవ్రంగా గాలిస్తున్నారు.

ముగ్గురిపై కుక్కల దాడి

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): యైటింక్లయిన్‌కాలనీలో వీధికుక్కలు శుక్రవారం ముగ్గురిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. ఆర్జీ–2ఏరియా వర్క్‌షాపులో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సెక్యూరిటీ గార్డు మహబూబుపై దాడిచేశాయి. వీటిదాడిలో కుడికాలు తొడభాగంలో తీవ్రగాయాలయ్యాయి. అదేవిధంగా కాంట్రాక్ట్ డ్రైవర్ బద్రుపైనా కుక్క దాడిచేసింది. మరో సింగరేణి ఉద్యోగస్తుని కూడా కుక్క కరిచి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు.

'జ్యోతిష్మతి'లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ప్రారంభం

తిమ్మాపూర్: మండలంకేంద్రంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో శాప్ ల్యాబ్స్ ఇండియా ఆధ్వర్యంలో కోడ్ ఉన్నతి ప్రోగ్రాం, ఎడ్యునెట్ ఫౌండేషన్ టాస్క్ మార్గదర్శకత్వంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ విభాగాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రభుత్వ టెక్నాలజీ డెలివరీ, ప్లేస్‌మెంట్, కార్పొరేట్ రిలేషన్స్, టాస్క్, ఐటీ, ఈసీ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ ఎడ్యునెట్, టాస్క్‌తో కలిసి సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా సాప్ ల్యాబ్‌లు ప్రయోగాత్మకంగా శిక్షణ అందించేందుకు రూ.30 లక్షలతో జ్యోతిష్మతి కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సులభంగా ఉపాధిని పొందాలని ప్రోగ్రాం మేనేజర్ మహ్మద్ అఫ్సర్ పాషా విద్యార్థులకు పిలుపునిచ్చారు. డిస్ట్రిక్ట్ రిలేషన్‌షిప్ మేనేజర్ గంగాప్రసాద్ మాట్లాడుతూ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలకు శిక్షణ ఇవ్వడం, పరిశ్రమ సంబంధిత నైపుణ్యాలు, ఉపాధిని ప్రోత్సహించడం కోసం ఏర్పాటు చేయబడిందని తెలిపారు. కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు మాట్లాడుతూ శాప్‌ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జ్యోతిష్మతి కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ జువ్వాడి సుమిత్‌సాయి, క్లస్టర్ మేనేజర్ సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, అకడమిక్ డీన్ డాక్టర్ పీకే.వైశాలి, హెచ్‌వోడీ జగదీశన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రతినిధి ప్రదీప్ రెడ్డి

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- ఉద్యోగం రాలేదని మనస్తాపం
- తల్లిదండ్రులు ఇంట్లో లేనిసమయంలో బలవన్మరణం



పవన్(ఫైల్)

గోదావరిఖని: బీటెక్ పూర్తి చేసినా ఉద్యోగం రావడం లేదనే మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది దాతు పవన్ పటేల్(25) ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని గంగానగర్‌లో నివాసం ఉంటున్న 8వ డివిజన్ కార్పొరేటర్ దాతు శ్రీనివాస్ కుమారుడు దాతు పవన్‌పటేల్(25) గతేడాది బీటెక్, డిగ్రీ పూర్తి చేశాడు. అప్పటి నుంచే హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం కోసం అన్వేషణ చేస్తున్నాడు. అతడి స్నేహితుడి తల్లి ఇటీవల చనిపోవడంతో పరామర్శించేందుకు గోదావరిఖనికి వచ్చాడు. తన తండ్రి శ్రీనివాస్ పనినిమిత్తం ఊరుకు వెళ్లగా, తల్లి బంధువుల ఇంటికి వెళ్లింది. ఈ సమయంలో పవన్ పటేల్ తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం తల్లి గోదావరిఖని వచ్చి తలుపుకొట్టినా తీయలేదు. బంధువుల సహకారంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా చూడగా పవన్ పటేల్ ఉరివేసుకుని మృతి చెంది కనపించాడు. మృతుడి తండ్రి దాతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వివరించారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

- గురుకుల విద్యాసంస్థల అధికారి అలివేలు



తనిఖీ చేస్తున్న అలివేలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను శుక్రవారం గురుకుల విద్యాసంస్థల మల్టీజోన్–1 అధికారి అలివేలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలలోని తరగతి గదులు, వంటగది, లైబ్రరీ, విశ్రాంతిగదులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ సమత, అధ్యాపకులు శ్రీహరి, పద్మజ, సూపరింటెండెంట్ సురేశ్‌కుమార్, వెంకటేశ్వర్ రావు, శంకరయ్య పాల్గొన్నారు.

డబ్బుల కోసం బెదిరింపులు

- వలవేసి పట్టుకున్న పోలీసులు

కోరుట్ల: కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి కొందరికి ఫోన్‌లు చేసి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యక్తి ఏడాది క్రితం పిస్టల్‌తో పోలీసులకు పట్టుబడ్డాడు. ఆ సమయంలో డబ్బుల సంపాదన కోసమే ముంబయ్ నుంచి పిస్టల్ కొనుగోలు చేసి తెచ్చుకున్నానని చెప్పాడు. తర్వాత బెదిరింపులకు పాల్పడే క్రమంలో పోలీసులకు సమాచారం అందడంతో పిస్టల్ అప్పగించి లొంగిపోయాడు. అప్పుడు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మళ్లీ అదే వ్యక్తి గ్రామంలోని పలువురికి ఫోన్‌లు చేస్తూ తనకు డబ్బులు ఇవ్వాలని లేకుంటే మీ అంతుచూస్తానని కొన్ని రోజులుగా బెదిరించడం కలకలం రేపింది. ఈక్రమంలో నిందితుడు శుక్రవారం సాయంత్రం కోరుట్లకు చెందిన ఓ కౌన్సిలర్ భర్తకు ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్న క్రమంలో పోలీసులు వలవేసి గ్రామ శివారులో పట్టుకున్నట్లు సమాచారం. పోలీసులను చూసి సదరు వ్యక్తి పారిపోయే ప్రయత్నం చేయగా వెంటబడి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, నిందితుడి వెంట ఉన్న మరో ఇద్దరు పారిపోయినట్లు తెలిసింది.

బైండోవర్ వ్యక్తులు బాధ్యతగా ఉండాలి

సిరిసిల్ల క్రైం: బైండోవర్ అయిన వ్యక్తులు బాధ్యతగా ఉండాలని సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ అన్నారు. సిరిసిల్లకు చెందిన లింగంపల్లి అనిల్ మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేయగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినా మారకుండా మళ్లీ ఇసుక అక్రమ రవాణా చేసినందుకు కేసు నమోదు చేశామన్నారు. ఎమ్మార్వో ఎదుట హాజరుపర్చగా రూ.15వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే బైండోవర్ అతిక్రమించిన బల్వీర్‌సింగ్, మల్లవ్వలకు రూ.20వేలు చొప్పున జరిమానా విధించారని అన్నారు. తుమ్మల శివకుమార్‌కు తహసీల్దార్ వారెంట్ జారీ చేసినట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ కరీంనగర్ బోయవాడలో ఇంటిపని చేయుటకు పనిమనిషి కావలెను. సమయం ప్రొద్దున ఏడు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు. వివరాలకు సంప్రదించండి అరుణ్ కుమార్ ఫోన్ : 9154897506 [WA-17214]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం 18K. ఫోన్: 9160900024, 9640400073 [H-796271]

For Classifieds, Advertisements Contact: 9951602933 9951602824

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భరోసా లేని 'సీపీఎస్'

- పాత పింఛన్ విధానం కొనసాగించాలని డిమాండ్
- విద్రోహ దినంగా సెప్టెంబర్ 1
- కలెక్టరేట్ల ఎదుట నిరసన దీక్షలు, ర్యాలీలు

కరీంనగర్: ఉద్యోగభద్రత మంచి జీతభత్యాలు, ఉద్యోగ విరమణ అనంతరం నెలానెలా పింఛను ఉంటుందని ప్రభుత్వ కొలువులకు ప్రాధాన్యం ఇస్తుంటారు. ప్రస్తుతం అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) ప్రభుత్వ ఉద్యోగులను తీవ్రంగా కలచివేస్తోంది. మూడు దశాబ్దాలకుపైగా ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైర్డు అయిన తర్వాత తమకు, తమ కుటుంబాలకు సామాజిక భద్రత లేకపోవడంతో సీపీఎస్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యమ బాటపడుతున్నారు. దేశవ్యాప్తంగా 60 లక్షల మంది రాష్ట్రంలో 1.25 లక్షలమందికి పైగా ఉద్యోగులు సీపీఎస్ పథకంలో కొనసాగుతున్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో కొన్నాళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. కొత్త విధానంతో తమకు భద్రత లేదని అంటున్నారు. కేంద్రం 2004 జనవరి 1 నుంచి అమలు చేయగా, రాష్ట్ర ప్రభుత్వం అదే ఏడాది సెప్టెంబర్ నుంచి సీపీఎస్ విధానం అమలు చేసింది. సీపీఎస్ విధానంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 14 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. భరోసా లేని పెన్షన్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(జాక్టో), యూఎస్పీసీ, జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ తెలంగాణ ఎంప్లాయిస్, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దుకు, పాత పెన్షన్ పునరుద్ధరణకు పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ జిల్లాకేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు, కలెక్టరేట్ల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపే కార్యక్రమానికి పిలుపునిచ్చారు.


హామీలు అమలు చేయాలి



ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం విచారకరం. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమాకమైన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ పెన్షన్ విధానం అమలును ఎత్తివేసి పాతపెన్షన్‌ను పునరుద్ధరించాలి. సెప్టెంబర్1న ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలి.

–తూముల తిరుపతి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పెన్షన్ భిక్ష కాదు



దేశ్ల ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలకు పెన్షన్ మంజూరు చేస్తున్న ప్రభుత్వం 35 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసిన ఉద్యోగులకు పెన్షన్ లేదనడం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే. పెన్షన్ అనేది భిక్ష కాదు అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాలకులు విస్మరించడం బాధకరం. సెప్టెంబర్1న నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొనాలి.

– హనుమండ్ల భాస్కర్, టీసీపీఎస్ఈఉ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సీపీఎస్ రద్దుకు ఉద్యమిస్తాం



నూతన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలి. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమను చూపించడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసే దిశగా ప్రయత్నించాలి. సెప్టెంబర్ 1న ఉద్యోగ, ఉపాధ్యాయులు చీకటి దినంగా భావిస్తూ విధుల్లో నల్లబ్యాడ్జీలు ధరించి జరిగిన నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలి.

–కట్టా రవీంద్రచారి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

భూ వివాదంలో 21మందిపై కేసు

- ఆరుగురి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- మిగతా 15 మందిపై కొనసాగుతున్న విచారణ



భూకబ్జాదారులను వైద్య పరీక్షలకు తీసుకెళ్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: తప్పుడు రిజిస్ట్రేషన్, నకిలీ ధ్రువపత్రాలతో భూ కబ్జాకు యత్నించిన ఘటనలో కరీంనగర్‌కు చెందిన కొత్త జైపాల్‌రెడ్డి, చిట్టుమల్ల శ్రీనివాస్‌తో పాటు మరో 19మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. వీరిలో శుక్రవారం ఆరుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ, బాధితుడి కథనం ప్రకారం.. కరీంనగర్ కమాన్‌రోడ్డుకు చెందిన నీరుమల్ల శ్యామ్‌సుందర్ మానకొండూర్‌లో రెండు ఎకరాలకు పైగా భూమిని దేశబోయిన బాలయ్య కుమారులైన జగత్ ప్రకాశ్, శ్రీనివాస్, గోపాల్, శ్రీకాంత్ నుంచి కొనుగోలు చేశాడు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ధరణిలో విక్రయించిన భూమికన్నా అదనంగా నమోదైంది. నీరుమల్ల శ్యామ్ సుందర్‌కు విక్రయించిన భూమిలోనే తప్పుడు హద్దులుచూపుతూ కొంతభూమిని కొండా మురళికి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై శ్యాంసుందర్ నిలదీయగా కొండా మురళి, యంసాని రాధాకిషన్ రూ.25లక్షలు డిమాండ్ చేశారు. ఈ సమస్యను మరింత జఠిలం చేసేందుకు దేశబోయిన జగత్ ప్రకాశ్, శ్రీనివాస్, గోపాల్, శ్రీకాంత్‌తో కుమ్మక్కైన కొండా మురళి, గంప రమేశ్, గంప నాగరాజు, వంగల సంతోష్ సదరు భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తరువాత చిట్టుమల్ల శ్రీనివాస్ అతని కుమారుడు చిట్టుమల్ల అచ్యుత్ చైతన్యల పేరిట తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించారు. తనకు జరుగుతున్న అన్యాయం గురించి శ్యాంసుందర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. ఇది తెలిసిన చిట్టమల్ల శ్రీనివాస్ శ్యాంసుందర్‌ను పిలిపించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో కేసును వెనక్కి తీసుకున్నాడు. ఇందుకోసం కొంత భూమిని బొల్లినేని సృజన్‌రావు పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుని, అతని నుంచి కొత్త జైపాల్‌రెడ్డికి బదలాయించారు. ఆ తరువాత అసలు పట్టాదారులతో కుమ్మక్కై సదరు భూమిని కొండా మురళి, వంగల సంతోష్, గంపఫణీంద్ర పేరిట కొంత భూమిని పట్టా చేశారు. మానకొండూర్‌లో తాను కొనుగోలు చేసిన భూమి విషయంలో కొందరు ఇబ్బందులకు గురిచేస్తూ.. తన భూమిని కాజేయాలని చూస్తున్నారని బాధితుడు నీరుమళ్ల శ్యామ్‌సుందర్ కరీంనగర్ టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో నిజమని తెలియడంతో చిట్టుమల్ల శ్రీనివాస్, చిట్టుమల్ల అచ్యుత్ చైతన్య, గంప రమేశ్, కొండా మురళి, వంగల సంతోష్ కుమార్, గంప నాగరాజు, గంప లవకుమార్, గంప రవళి, వంగల గీత, గంప ఫణింద్ర, యాంసాని రాధాకృష్ణ, ఆకుల సుదర్శన, దేశబోయిన జగత్ ప్రకాశ్, శ్రీనివాస్, గోపాల్, శ్రీకాంత్, రేగొండ సందీప్, మాకు వెంకట శారదాదేవి, బొల్లినేని సృజనరావు, కొత్త జయపాల్‌రెడ్డి, దువ్వంతుల లక్ష్మారెడ్డిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం చిట్టుమల్ల శ్రీనివాస్, అచ్యుత్ చైతన్య, గంప నాగరాజు, దేశబోయిన శ్రీకాంత్, దేశబోయిన గోపాల్, దేశబోయిన శ్రీనివాస్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. మిగితా 15మందిపై విచారణ కొనసాగుతోందని సీఐ విజయ్ కుమార్ వివరించారు.